# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 239 గురువారం | 28 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## అజాత శత్రువు..
## బాలగంగాధర్ తిలక్

- అంచెలంచెలుగా ఎదిగిన వైనం
- వివాదరహితుడిగా గుర్తింపు..
- ఉత్తమ పౌర సంబంధాల అధికారిగా అవార్డు
- ఆదర్శప్రాయుడిగా నిలిచిన తిలక్
- మార్చి 31న పదవీ విరమణ
- జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం

7లో

# వెంటాడుతున్న కేసులు




## పార్టీ వీడుతున్న నేతలు

### తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్న కేసీఆర్
### రాజకీయంగా కోలుకోలేని స్థితిలో బీఆర్ఎస్
### పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తేనే మనుగడ

నిన్న, మొన్నటి వరకు మహరాజులా ఒక వెలుగు వెలిగిన కేసీఆర్‌ను నేడు పలు కేసులు వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో ఇంతకాలం కేసీఆర్ వెంట నడిచిన వారు ఒక్కొక్కరుగా వీడిపోతున్నారు. దీనికితోడు అవినీతి, అక్రమాలు, ఫోన్ ట్యాపింగ్ కేసుల ఉచ్చు తగులుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ కేసులో కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత ఊచలు లెక్కిస్తున్నారు. ఇవన్నీ కేసీఆర్‌ను రాజకీయంగా కోలుకోలేని స్థితిలోకి నెట్టేస్తున్నాయి. దీంతో కేసీఆర్ వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఆయనకు అన్ని దారులు మూసుకు పోయాయన్న ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో రానున్న లోక్ సభ ఎన్నికలు కేసీఆర్‌కు పెద్ద టాస్క్‌గా మారాయి. ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమొక్కటే కేసీఆర్ ముందున్న సవాల్. లేకుంటే పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

- వరంగల్ వాయిస్, వరంగల్









వివరాలు 2లో..



8లో

## వారిది త్యాగాల కుటుంబం

- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం
- రాష్ట్ర మంత్రి సీతక్క

## లైసెన్స్‌డ్ తుపాకులను అప్పగించండి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



8లో..




2లో

## ప్రజలకు న్యాయం చేయాలి

- వారి సమస్యలపై వెంటనే స్పందించాలి
- మల్టీ జోన్ - 1 ఐజీ ఏవీ రంగనాథ్




# వెంటాడుతున్న కేసులు

# పార్టీ వీడుతున్న నేతలు



**తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్న కేసీఆర్**

**రాజకీయంగా కోలుకోలేని స్థితిలో బీఆర్ఎస్**

**పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తేనే మనుగడ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాల్కె అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి అగ్నిపరీక్షను ఎదుర్కొంటోంది. పదేండ్లు రాష్ట్రాన్ని ఏకచత్రాధిపత్యంతో పాలించిన కేసీఆర్ తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకోకముందే లోక్‌సభ ఎన్నికలు పార్టీ మనుగడకే సవాల్ విసురుతున్న పరిస్థితి కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో గణనీయ ఫలితాలు సాధించని పక్షంలో పార్టీ ఉనికి ప్రశ్నార్థకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### రాజకీయ సవాళ్లు..

అధికారం కోల్పోవడంతో కేసీఆర్ వెంట నడిచిన వారు ఒక్కొక్కరూ పార్టీ వీడిపోతున్నారు. ఆయనతో ఇంతకాలం ఉన్న బంధాన్ని వారు కేవలం అధికారంతో మాత్రమే ముడి పెట్టుకున్నట్లు తెలుస్తోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం నాలుగైదు సీట్లయినా గెల్చుకుంటేనే బీఆర్ఎస్‌కు ప్రాణం ఉంటుంది. ఈ క్రమంలో తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఆయనకు అన్ని దారులు మూసుకుపోయాయన్న ప్రచారం సాగుతోంది. దీనికితోడు అవినీతి, అక్రమాల కేసుల, ఫోన్ ట్యాపింగ్ కేసుల ఉచ్చు తగులుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే పార్లమెంటులో విజయంతో మళ్లీ సర్దుకునే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కూడా ఇప్పుడు అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన స్వీప్ చేయకున్నా నాలుగైదు సీట్లు తెచ్చుకుని గట్టి ప్రభావం చూపించగలగితే రాజకీయంగా నిలబడతారు. లేకుంటే రాజకీయ సునామిలో కొట్టుకుపోతారన్న ప్రచారం సాగుతోంది.

దశాబ్దంన్నర పాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేయడంలో కేసీఆర్, నాటి టీఆర్ ఎస్ పాత్ర తక్కువేమీ కాదు. రాష్ట్రం సిద్ధించిన అనంతరం అప్రతిహతంగా బీఆర్ ఎస్ రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చింది. పది సంవత్సరాలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించారు. ముచ్చటగా మూడోసారి అంటూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారాన్ని ప్రారంభించిన బీఆర్ ఎస్ అనూహ్యంగా పరాజయం పాలైంది. తీవ్రమైన ఓటమి నుంచి ఆ పార్టీ కోలుకోకముందే నాలుగు నెలల స్వల్పకాలంలోనే పార్లమెంట్ ఎన్నికలు ముంచుకురావడం సవాల్‌గా మారింది. కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంలో ఇరుక్కోవడం ఎన్నికల ముందు ఎజెండా కాగా, ఎన్నికల తర్వాత రాద్ధాంతంగా మారింది. తాజాగా కవిత అరెస్టు, జైలు ఆ పార్టీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టాయనే చెప్పవచ్చు. మరో వైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బీఆర్ ఎస్ ప్రభుత్వం మెడకుచుట్టుకుంటోంది.

### గోరుచుట్టుపై రోకటిపోటు..

బీఆర్ ఎస్ లో ఇబ్బందికరమైన వాతావరణం నెలకొననగా గోరుచుట్టుపై రోకటిపోటులా పార్టీ నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వలసపోవడం ఇబ్బందిగా మారింది. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలకు పెద్ద సంఖ్యలో సాగుతున్న వలసలు గులాబీ నాయకత్వానికి కంటి విరీద కునుకులేకుండా చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడగానే బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలుగా గెలిచిన మాజీ మంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతోందని జోస్యాలు చెప్పడం ప్రారంభించారు. ఇప్పుడు ఆ మాటలే బీఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారాయి.

### పార్టీ ఫిరాయింపులు..

నైతికత అంశాన్ని పక్కకుపెడితే తమ ప్రభుత్వ రక్షణకు ఫిరాయింపులను ప్రోత్సహించక తప్పలేదంటూ ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గేట్లు ఎత్తుతున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. తాజాగా నాగేందర్‌ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం రాజకీయ కలవరానికి దారితీసింది. పలువురు సిట్టింగ్ ఎంపీలు కూడా పార్టీని వీడారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. మెజార్టీ సిట్టింగ్ ఎంపీలు రెండు పార్టీల్లోకి జంప్ అయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ ఒంటరి పోరాటం చేస్తున్నారనే చెప్పవచ్చు. 17 ఎంపీ స్థానాలకుగానూ ముగ్గురు సిట్టింగులకు బీఆర్ఎస్ అధినేత అవకాశం కల్పించారు. ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ స్థానాలు సిట్టింగ్‌లకు ఇచ్చారు. కరీంనగర్ సీటు గత ఎన్నికల్లో పోటీ చేసిన బి.వినోద్ కుమార్‌కు కేటాయించారు. ఇక మిగిలిన 13 స్థానాల్లో కొత్తవారిని బరిలో దింపారు.

### పోటీ లేదంటూ ప్రచారం..

ఎంపీ టికెట్ కోసం బీఆర్ ఎస్ పార్టీలో కనీస పోటీ లేదంటూ పార్టీ వర్గాలే చర్చించుకోవడం ఆ పార్టీ బలహీన పడిందనడానికి నిదర్శనంగా మారుతోంది. ఓడిపోయే స్థానానికి పోటీ ఎందుకనే అభిప్రాయంతో పలువురు నేతలు ఉన్నారన్న వార్తలు నట్టింట వైరలవుతోంది. వలసలను నివారించేందుకు బుజ్జగింపులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. చేవెళ్ళ టికెట్ రంజిత్ రెడ్డికి బీఆర్ ఎస్ ముందుగా డిక్లేర్ చేసినప్పటికీ ఆ పార్టీని కాదంటూ అధికార కాంగ్రెస్‌లో చేరిపోయి ఆ పార్టీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీ మారుతున్నారని తెలిసి ఆయనను బలవంతంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్ళి బుజ్జగించినా.. ఆ తర్వాత బీజేపీలో చేరి వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మారిపోయారు. తనకు ప్రజాభిమానం ఇంకా మెండుగా ఉందని నిరూపించుకుంటే కొంతకాలం రాజకీయంగా నిలబడతారు. కానీ అక్రమాలు, ఆర్థిక కేసులు మాత్రం వదలవని గుర్తించాలి.

# ప్రజలకు న్యాయం చేయాలి

**వారి సమస్యలపై వెంటనే స్పందించాలి**

**మల్టీ జోన్ - 1 ఐజీ ఏవీ రంగనాథ్**

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ప్రజలకు పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మల్టీ జోన్ -1 ఐజీ ఏవీ రంగనాథ్ అన్నారు. బాధితులకు న్యాయం జరిగినపుడే పోలీసులు ప్రజల మన్ననలు పొందుతారన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి లోక్ సభ ఎన్నికలతో పాటు, పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే భూపాలపల్లి జిల్లా భౌగోళిక పరిస్థితి, అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గ పరిధి, పోలింగ్ లోకేషన్లు, పోలింగ్ కేంద్రాలు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, జిల్లాలో ఉన్న ఓటర్లు, ఎన్నికల సందర్భంగా సెక్యూరిటీ ప్లాన్ తదితర అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐజీకి వివరించారు. అనంతరం ఐజీ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు నిర్వహించడానికి అధికారులందరూ సమష్టిగా, సమర్ధవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు. శాంతి భద్రతల విషయంలో నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని, ఎవరైనా చట్ట వ్యతిరేఖ చర్యలకు దిగితే కఠినంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఐజీ పేర్కొన్నారు. విధినిర్వహణలోఅలసత్వం వహించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెండింగ్ లో ఉన్న కేసుల్లో ఇన్వెస్టిగేషన్ త్వరగా పూర్తిచేసి డిస్పోజల్ చేయాలన్నారు. లాంగ్ పెండింగ్ కేసులపై రివ్యూ నిర్వహించి సంబంధిత అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, వర్టికల్ డీఎస్పీ నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సీఐలు నరేష్ కుమార్, మల్లేష్, రాజేశ్వర్ రావు, నాగార్జున రావు, వసంత్ కుమార్, రామకృష్ణ, రవీందర్, రిజర్వు, ఇన్స్పెక్టర్ లు నగేష్, కిరణ్, రత్నం, శ్రీకాంత్, జిల్లా పరిధిలోని ఎస్ ఐ లు పాల్గొన్నారు.

# భద్రకాళి హుండి ఆదాయం రూ.39.33 లక్షలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో గురువారం నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ. 39, 33,240 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషు భారతి ప్రకటించారు. ఈ మొత్తాన్ని యూనియన్ బ్యాంక్ లోని దేవస్థాన అకౌంట్ లో జమ చేసినట్లు వెల్లడించారు. హుండీలో 387 అమెరికా డాలర్లు, 30 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ పౌండ్స్, 31 మలేషియా రిగ్గెట్స్ లభించాయన్నారు. హుండీలో లభించిన వెండి, బంగారం వస్తువులను తిరిగి హుండీలోనే వేసినట్లు ప్రకటించారు. దేవాదాయ శాఖ కార్యాలయ పరిశీలకులు ఎం అనిల్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర సేవ సమితికి చెందిన 100మంది సభ్యులు, దేవాలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, మరిపెడ :** సీనియర్ జర్నలిస్టు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారిగా సుధీర్ఘ కాలం సేవలు అందించిన ఎం.సుధాకర్ రావు కుటుంబానికి మహబూబాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) శాఖ సూచన మేరకు మరిపెడ మండల శాఖ తరుపున రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని ఐజేయూ సీనియర్ నాయకుడు దాసరి క్రిష్ణారెడ్డి, టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ లు సుధాకర్ రావు కుటుంబ సభ్యులకు హనుమకొండలోని వారి స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా దాసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్ట్ లకు సహాయం చేయడంలో మహబూబాబాద్ జిల్లాశాఖ అనేక సందర్భాల్లో తన ప్రత్యేకతను, మంచితనాన్ని చాటుకుందన్నారు. ఉమ్మడి జిల్లా కోశాధికారిగా జర్నలిస్ట్ లకు సేవలందించిన సుధాకర్ మరణించిన ఆయనను గుర్తుంచుకొని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మరిపెడ మండల శాఖ రూ.10వేల ఆర్థిక సహాయాన్ని పంపించడం అభినందనీ యమన్నారు. ఆపదలో, అవసరంలో ఉన్న జర్నలిస్ట్ లకు మేమున్నాం అని భరోసానిస్తున్న మహబూబాబాద్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనిట్ ను, మరిపెడ మండల శాఖను ఐజేయూ నాయకులు దాసరి కృష్ణారెడ్డి, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ లు ప్రశంసించారు.

## ఖాజీపూర్ ఘటనను ఖండిస్తున్నాం




**వరంగల్ వాయిస్, పరకాల :** సిద్ధిపేట జిల్లా అక్బర్ పేట, భూంపేట మండలం ఖాజీపూర్ గ్రామంలో ముదిరాజ్ లను గ్రామస్తులు బహిష్కరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మెపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఖాజీపూర్ గ్రామంలోని ముదిరాజ్ లను బహిష్కరించడమే కాకుండా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేసుకోవద్దని అనడం విడ్డూరంగా, హాస్యస్పదంగా ఉందన్నారు. గ్రామంలోని కిరాణాలలో నిత్యవసర వస్తువులు ఇవ్వద్దని, నాయీ బ్రాహ్మణులు కటింగ్, గడ్డం చేయవద్దని, రజకులు బట్టలు ఉతకవద్దని, ఎవరైనా చనిపోతే చావు డప్పు కొట్టవద్దని, వీటిని అతిక్రమించితే రూ.5 వేల జరిమానా అని గ్రామ పెద్దలు జారీ చేయడం పట్ల తీవ్రంగా ఆగ్రహించారు. ముదిరాజులకెందుకు కులవృత్తి వర్తించదని, చెరువులో చేప పిల్లలను వేసి రాత్రింబవళ్లు కంటికి రెప్పలా కాపాడుతూ చేపలను సంరక్షించుకుంటూ, చేపలను అమ్ముకోవడమే ముదిరాజ్ లకు జీవనోపాధి అని అన్నారు. ఖాజీపూర్ గ్రామ పెద్దలు ముదిరాజ్ లకు ఎవరు సాయం చేయవద్దని అనడం విడ్డూరంగా ఉందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముదిరాజ్ కులస్తులు సిద్దిపేట కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్ లకు న్యాయం జరగకపోతే మెపా ఆధ్వర్యంలో ముదిరాజ్ లకు అండదండగా ఉంటూ, వారి పక్షాన్నే నిలబడి పోరాటం చేస్తామని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీపై విమర్శలు సరికాదు



**వరంగల్ వాయి, పరకాల :** ఇటీవల బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నారగాని శ్రీనివాస్, దేవేందర్ కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను నడికూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ల నవీన్ ఖండించారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల గడిచిన కాలంలో నిరుద్యోగ భృతి గానీ, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు గానీ, రైతు రైతు రుణమాఫీ గానీ అందించలేదని, కానీ కాంగ్రెస్ పార్టీ వచ్చిన 100 రోజుల్లోనే వివిధ అభివృద్ధి పనులు జరగాలనడం బీఆర్ఎస్ నేతల తీరు, కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. అదే గత ప్రభుత్వంలో మొరం, మట్టి దందా చేసిన మాజీ ఎమ్మెల్యే ధర్మా రెడ్డి దగ్గర నుంచి పదివేలు, రూ. 20 వేలు తీసుకున్న నాయకులు నేడు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. అదేవిధంగా నడకూడ మండలానికి చెందిన గుట్టలను తమ సొంత ప్రయోజనాల కోసం అమ్ముకొని డబ్బులు కూడబెట్టుకున్న నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సరికాదని విమర్శించారు.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అటవీ హక్కుల చట్టం ఆహారభద్రత, ఉపాధి హామీ సమాచార హక్కు, విద్య హక్కు చట్టాలు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రధాని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీ తో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో శాయంపేట మండలం నుంచి భారీ మెజార్టీ తెచ్చే విధంగా పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడే బాధ్యత నేను తీసుకుంటానని అన్నారు. అనంతరం మండలంలోని కొప్పుల గ్రామం నుంచి మాజీ సర్పంచ్ గోలి మాధురి మహేందర్ రెడ్డి, బీ ఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామల మధుసూదన్, మాజీ సర్పంచ్ గుర్రం రవీందర్, వార్డు సభ్యులు ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. మాందారి పేట గ్రామం నుంచి కొమ్ముల సదానందం, కానిగంటి సదానందం, శాయంపేట నుంచి వార్డు సభ్యులు, మాజీ వార్డ్ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, ఆర్ట్ రాజులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్, మాజీ సర్పంచులు కందగట్ల రవి, అబ్బు ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, మాజీ ఏఎంసీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, నాయకులు దుబాసి కృష్ణమూర్తి, భాషని శాంతా రవి, మారపల్లి రవీందర్, సాదు నాగరాజు, ఎండీ హైదర్, తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మూరిని కలిసిన సామల పరమేశ్వర్



**వరంగల్ వాయిస్, జనగామ :** కాంగ్రెస్ పార్టీ పద్మశాలి విభాగం జనగామ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దేవరుప్పుల మండలం, కోలుకొండ గ్రామానికి చెందిన సామల పరమేశ్వర్ జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సామల పరమేశ్వర్ కు శుభాకాంక్షలు తెలిపి, అభినందించి, పార్టీ శ్రేయస్సు కోసం నిర్విరామంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేముల బాలరాజు, దోర్నాల వెంకటేశ్వర్లు, కామిని శ్రీనివాసు, నల్ల సత్యనారాయణ, ఏల జనార్ధన్, పిట్టల సతీష్, గుమ్మడిల్లి సత్యనారాయణ, ఎనగందుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇమ్మానియేల్ రాజు



**వరంగల్ వాయిస్, స్టేషన్‌ఘన్‌పూర్ :** నియోజకవర్గ పరిధిలోని రఘునాథపల్లి ఫంక్షన్ హాల్‌లో నూతన వధూవరులు సుమలత–సురేష్‌ల వివాహానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్‌ఘనపూర్ ఇంచార్జి సింగపురం ఇందిర కుమారుడు ఇమ్మానియేల్ రాజు హాజరై నూతనవధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, బ్లాక్ ఇంచార్జి మండల ముఖ్య నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మాజీ జడ్పీటీసీ, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్, చంద్రా రెడ్డి, ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, గాదే మహేందర్ రెడ్డి, గాదే రమేష్ పటేల్, మల్లేష్, అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, కంసాని మధుసూదన్ రెడ్డి, తోటకూర రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

### జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్




**వరంగల్ వాయిస్, మరిపెడ :** నేటి యువత స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో కాంప్లెక్స్ లో మండలంలోని వీరారం గ్రామానికి చెందిన మామిడాల మునేష్ అనే యువకుడి 'సాగర్ మెన్స్ బ్యూటీ పార్లర్ అండ్ హెయిర్ స్టైల్' షాపును మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబుతో కలిసి నవీన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉపాధి మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు. నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని పలువురికి ఉపాధి కల్పించడంతో పాటు సమాజంలో ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేలోత్ హరినాయక్, బీఆర్ఎస్ నాయక్ లు అజ్మీరా హరినాయక్, జర్పుల కాలు నాయక్, బొల్లం నర్సయ్య, దిగజర్ల శ్రీను, ముఖేష్, గంధసిరి కృష్ణ, గుండగాని సుందర్, చంద్రయ్య, మహిపాల్ రెడ్డి, మామిడాల వెంకన్న పాల్గొన్నారు.

# వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేపట్టాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వేసవిలో ఆయిల్ పామ్, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయల సాగులో రైతులు చేపట్టవలసిన జాగ్రత్త చర్యలు, మేలైన యాజమాన్య పద్ధతులపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్నఅవగాహన కల్పించారు. కురవి, సీరోలు, డోర్నకల్, మహబూబాబాద్ తదితర మండలాలలోని పలు గ్రామాలలో ఆయిల్ పామ్, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయల తోటలను గురువారం ఆయన పరిశీలించారు. వేసవిలో ఉద్యాన పంటలు చేపట్టి రైతులు లాభం పొందాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లాలో 96,631 ఎకరాలలో రైతులు పలు ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుత మార్చి, ఏప్రిల్ నెలలలో పలు ఉద్యాన పంటల సాగు వలన లాభం కలుగుతుందని తెలిపారు. ప్రస్తుతం రైతులు తీసుకోవలసిన సాంకేతిక సూచనలు, సలహాలను రైతులకు తెలియజేశారు. రైతులు ఆయిల్ పామ్ తోటలలో అంతర పంటలుగా కూరగాయలైన టమాట, మిర్చి, బీర, వంగ, గోరు చిక్కుడు, బెండ, ఉల్లి, బీట్ రూట్, ఆకుకూరలు, కొత్తిమీర, పుదీనా తదితర పంటలను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. వాటితో పాటు ఆధునిక పద్ధతులు అయిన ఎత్తైన మడులు, బిందు సేద్యం, మల్చింగ్ విధానం, సేంద్రియ పద్ధతులను వివరించారు. దీనివలన 30 నుంచి 40 శాతం దిగుబడులు పెరుగుతాయని తెలియజేశారు. మహబూబాబాద్ జిల్లాలో రైతులు డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, కూరగాయల సాగు, పూల సాగు తదితర వాటిని సాగుచేసి రైతులు నికర ఆదాయం పొందాలని ఆకాంక్షించారు. రైతులకు వర్మీ కంపోస్ట్, వేప పిండి, కానుగ పిండి, వేప నూనె వాడకంతో పాటు పూర్తి సేంద్రియ పద్ధతుల్లో వంగ, టమాట, మిర్చి, బీర, బెండ, సొర తదితర పంటల సాగు విధానాన్ని కూడా తెలియజేశారు. రైతులు సమీకృత వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేపట్టాలన్నారు. రైతులందరు రైతు ఉత్పత్తి సమాఖ్యలుగా ఏర్పడి, పంట కాలనీలను ఏర్పరుచుకొని, కూరగాయల సాగు చేసి మన జిల్లాలో స్వయం సమృద్ధి సాధించాలని విజ్ఞప్తి చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే జీఎస్సాఆర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట మండల కేంద్రంలోని ఎస్వీకే ఫంక్షన్ హాల్ లో బుధవారం జరిగిన భాషని రమ-రమేష్ కూతురు వివాహానికి ఎమ్మెల్యే జీఎస్సాఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హుస్సేన్ పల్లి గ్రామంలో గుండెకారి యువరాణి-రాజేందర్ కుమారుడి వివాహం, గంగిరేణి గూడెం గ్రామంలో రాపర్తి స్వరూప-రమేష్ కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ బాసని చంద్రప్రకాష్, నాయకులు పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, చల్ల చక్రపాణి, మారేపల్లి రవీందర్, లాడే రాజ్ కుమార్, డీటీ రెడ్డి, దుబాసి కృష్ణమూర్తి, భూతాల వీరన్న, తదితరులున్నారు.

## రేపు నాయిని ఇఫ్తార్ విందు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు రేపు సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండ జక్రియా ఫంక్షన్ హాల్ లో వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో నిష్ఠతో ఉపవాసాలు ఉంటారని, అల్లా అందరిని చల్లగా చూడాలని, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. ప్రతి సంవత్సరం సొంతంగా ఇఫ్తార్ పార్టీని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని అన్నారు. కాబట్టి, పార్టీలకు అతీతంగా ముస్లిం సోదరులు, మత పెద్దలు ఇఫ్తార్ పార్టీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గుండాల మదన్ కుమార్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ గుండాల మదన్ కుమార్ కు నర్సంపేట నియోజకవర్గ అధ్యక్షుడు బుర్రి సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బస్కే నాగరాజు, వరంగల్ ఈస్ట్ నియోజకవర్గ అధ్యక్షుడు జన్ను అనిల్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చింత సామ్యూల్, నర్సంపేట నియోజకవర్గ నాయకుడు శ్రీకాంత్ లు కలిసి పుష్పగుచ్ఛంతో పాటు శాలువా కప్పి సత్కరించారు. బహుజన వాదం ముందు తీసుకుపోవడానికి నా వంతుగా మీతో పాటు అందరం కలిసికట్టుగా పనిచేస్తామని ఈ సందర్భంగా మదన్ కుమార్ అన్నారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిని గెలిపించేందుకు కలిసి పని చేయాలని మదన్ కుమార్ పిలుపునిచ్చారు.

## అరూరిని కలిసిన బీజేపీ నేతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వర్ధన్నపేట మాజీ శాసనసభ్యుడు, బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ ను వారి నివాసంలో గురువారం మడికొండ భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నాగవల్లి గోపికృష్ణ, గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి దారావత్ సునీల్ కుమార్, ఏలగొండ శివ, ప్రధాన కార్యదర్శి బైరపాక వెంకటేష్, తక్కల్లపల్లి నిఖిల్ రావు, గడ్డం శ్రీధర్, మాచర్ల రంజిత్, గడ్డం కుమార్, దారంగుల రాజేష్, దూపెల్లి అరవింద్, పండుగ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 'పుట్టపాక రవి'



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట బార్ అసోసియేషన్ 2024-25 సంవత్సరం కోసం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పుట్టపాక రవి, ఉపాధ్యక్షుడిగా కోంగరి రాజు, ప్రధాన కార్యదర్శిగా శిలువెరు కిరణ్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా బోట్ల పవన్, నాగుల రమేష్, కంసానీ అశోక్, కోశాధికారిగా పోనుగోటి అజయ్, ఈసీ మేంబర్స్ గా తిరుమల్ చౌహాన్, బొడ్డుపెల్లి అజయ్, మాంకాళీ ప్రభాకర్, నందగిరీ రజినీ కాంత్ లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ తెలిపారు.

## కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

### సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. గురువారం దామెర మండల సీపీఐ సమితి సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ఉన్న ఉద్యోగాలను కూడా తొలగించిన చరిత్ర బీజేపీకి ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిరీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెడుతూ లక్షల కోట్ల రూపాయల రాయితీ ఇస్తూ ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా మరిచిందని మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థ రోజు రోజుకు దిగజారుతున్నదని, మరో పక్క ఆకలి, దారిద్ర్యం దిగువన సుమారు 40 కోట్ల మంది జీవిస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి పేదలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్ర భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలు నిరంతరం ఎక్కువైతున్నాయన్నాయని, ఉద్యోగాలు రాక నిరుద్యోగ వ్యవస్థ రోజురోజుకు పెరుగుతున్నదన్నారు. దేశంలో ఆదివాసీలు, గిరిజనులు, ముస్లిం క్రిస్టియన్స్ లపై, మైనార్టీలపై దాడులు పెరిగినా అదుపు చేయడంలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. దేశాభివృద్ధికి సహకరించే విధంగా ప్రజలు కదిలి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. ఈ సమావేశానికి కొట్టేపాక రవి అధ్యక్షత వహించగా సమావేశంలో మండల కార్యదర్శి అంబిసాంబయ్య, భాస్కర్, ఎడ్ల మంజుల, అమ్మ సాంబయ్య, గంధం శోభ, జయ, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 3, 4 తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా 36వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ పిలుపునిచ్చారు. పర్వతగిరి మండలంలోని ఆదర్శ కళాశాల నందు విద్యార్థులతో కలిసి వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని శివనగర్ , రఘునాథ్ భవన్ స్థానిక ఎస్ఎఫ్ఐ ఆఫీసులో జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థుల భవిష్యత్తు పోరాటాలకు పునాదులను వేసే విధంగా ఈ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఉద్యమంలో ముందుండి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని, సంక్షేమ హాస్టల్స్, గురుకుల పాఠశాలలో మెరుగైన సౌకర్యం కల్పించాలని, స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని, అధిక ఫీజులను అరికట్టాలని, విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డుపై అదుపుతప్పి లారీ బోల్తా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉర్సుగుట్ట వద్ద రాజమండ్రి నుంచి నిమ్మకాయల లోడుతో గోరఖ్ పూర్ వెళ్తున్నలారీ అదుపుతప్పి రోడ్డుపై పడింది. దీంతో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రమాదాన్ని తెలుసుకొని వెంటనే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ మల్లయ్యకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు ప్రమాద స్థలికి చేరుకొని ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

# బీజేపీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

## జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గం జోన్ ఇంచార్జిల, డివిజన్ అధ్యక్షుల, డివిజన్ ఇంచార్జిల సన్నాహక సమావేశంలో పార్లమెంటు ఎన్నికలకు బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను సమాయత్తపరిచేందుకు ఉద్దేశించి అసెంబ్లీ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అంశాలపై గంట రవికుమార్ మాట్లాడారు. పోలింగ్ బూత్ కమిటీలను పటిష్ట పరుస్తూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో చేరే విధంగా ప్రతి పోలింగ్ బూత్ సభ్యులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, కాసు శిల్ప, రత్నం కృష్ణ కిషోర్, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, అసెంబ్లీ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా, జిల్లా కార్యదర్శిలు గడల కుమార్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, సుమన్ ఖత్రి, బీజేపీ నాయకులు వన్నాల వెంకటరమణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, యువమోర్చా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేపీ జోనల్ ఇంచర్జిలు, డివిజన్ అధ్యక్షులు, ఇంచార్జిలు, పలు మోర్చా నాయకులు పాల్గొన్నారు.

## దాస్యం అభినవ్ భాస్కర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణంలోని 62, 63, 47 వ డివిజన్ల బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు రానున్న లోక్ సభ ఎన్నికలపై, వివిధ పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, అధికార ప్రతినిధి చాంద్ పాషా, మోతిలాల్, జనగాం వెంకేశ్వర్లు, గొర్రె రాజు, ఈసంపల్లి కరుణాకర్, మోడెమ్ రాజేష్, దామరుప్పుల సంతోష్, యదా రమేష్, సుంచు విజయ్, శ్రీనివాస్, పొలు శ్యామ్, చిలువేరు చిరంజీవి, సంతోష్, వికాస్, జక్కుల సమ్మయ్య, ముకేశ్ కుమార్, రాం కుమార్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ త్రివేదాద్రి సంతోషలక్ష్మి, నరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** న్యూ శాయంపేట శ్రీ త్రివేదాద్రి సంతోషలక్ష్మి, నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారి కళ్యాణం సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, వేల్పుల మోహన్ రావు గ్రంధి సత్యవతి సూర్యనారాయణ మంత్రి కొండా సురేఖ కు ఘనంగా స్వాగతం పలికారు .మంత్రి కొండా సురేఖ స్వామి వారిని దర్శించుకుని మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి సంబంధించి తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భారతాల వెంకన్న, బొల్లం యాదగిరి, వెనుకంటి కుమార్, అర్చకులు, 31వ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల విషయంలో రాజకీయం తగదు

## శ్రీరామ్ సాగర్ నీటిని పరిశీలించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, కొడకండ్ల :** పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి గురువారం కొడకండ్ల మండల కేంద్రంలో పర్యటించారు. మండల కేంద్రం శివారు హక్య తండా వద్దనున్న కెనాల్ నీటి ప్రవాహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అందుబాటులో ఉన్న రైతులతో ఆమె మాట్లాడారు. ఎస్సారెస్పీ రెండవ దశ కెనాల్ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలను వినియోగించుకుంటున్న తీరును ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. బయ్యన్నవాగు రిజర్వాయర్ ద్వారా 67, 69, 70,71 డీబీఎంల ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలను ఆయా ప్రాంతాల రైతులు పండించే పంటలకు వినియోగించుకుంటూ ఆనందోత్సవాల్లో స్థానిక రైతాంగం ఉందని ఎమ్మెల్యే అన్నారు. రెండో దశ కాలువ ద్వారా ప్రతిరోజు 1700 క్యూసెక్కుల నీటిని ప్రభుత్వం విడుదల చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఆయా నీటితో ఒక లక్ష 69 వేల ఎకరాల పంటలకు గోదావరి జలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. రైతుల విషయంలో రాజకీయం చేయడం తగదని, రైతుల విషయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి ఒకరు పంటలు ఎండిపోతున్నాయని, తమ కార్యకర్తలను సన్నద్ధం చేస్తూ రాద్ధాంతం చేసి మాట్లాడడం తగదని ఎమ్మెల్యే హితవు పలికారు. గోదావరి జనాలను వినియోగించుకుంటున్న రైతులు సంతోషంలో ఉన్నారని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల దేవరుప్పుల మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, నల్ల శ్రీరాములు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్ నాయక్, కొడకండ్ల కాంగ్రెస్ నాయకులు మసురం రవీందర్, కీసర సునీల్ రెడ్డి, మనోహర్, నూనె ముంతల, సోమనసయ్య, ధర్మారం భిక్షపతి, అందే శ్రీవర్ణ, ఐతేరాజు రాజు, దూలం సతీష్, తండ రమేష్, భూక్యా వీర్య నాయక్, దేశగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కష్టాలు ఎదురైతే ధైర్యంగా ముందుకు సాగాలి




**వరంగల్ వాయిస్, మరిపెడ :** జీవితం జీవించడానికేనని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురై నప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్- డాక్టర్ పరికిపండ్ల అశోక్ పేర్కొన్నారు. మరిపెడ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన ఆత్మహత్యలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలన్నారు. కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకు పోయినప్పుడు, ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారని తెలిపారు. మరిపెడ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్ స్పెక్టర్ తహేర్ బాబా మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పది సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మందిని కాపాడటం అభినందనీయమని అన్నారు. అనంతరం పాల్గొన్న వారిచే ఎన్ని కష్టాలు వచ్చినా ఎదిరిస్తామని, ఆత్మహత్యలు చేసుకోబోమని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్ఐ గంధ్ర సంతోష్, ఆరోగ్య మిత్ర సంస్థ సూరత్, ప్రతినిధి చలమల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** నియోజకవర్గంలోని జఫర్ గఢ్ మండలం వడ్డేగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు కొరుకొప్పుల నగేష్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ పార్టీలో చేరారు. వీరికి బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా నాకు ఈ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజానీకానికి సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అహర్నిశలు గెలుపు కోసం కృషి చేయాలని, పార్టీ కార్యకర్తలను నన్ను నమ్ముకున్న అందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని, పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకు సాగి ఘనమైన విజయాన్ని సాధిస్తామన్నారు. ఘనపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీకి అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా ప్రణాళికలు సిద్దం చేసుకొనీ ముందుకు వెళ్లాలని నాయకులను కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన వారిలో బొడ్డు అశ్విని, విజయ, రాణి, రంగమ్మ, అంబిక, రేణుక, శోభ, పద్మ, శాంత, రాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతి గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు రమేష్, రాజు, దళిత మోర్చా మండల అధ్యక్షుడు శ్రీను, మండల ఉపాధ్యక్షుడు అరవింద్, ఓబీసీ మండల మోర్చా శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షుడు లోకేష్ గౌడ్, సోషల్ మీడియా గణేష్ గౌడ్, గీతా సెల్ కన్వీనర్ రామరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారికి క్షీరాభిషేకం

### భక్తులతో పోటెత్తిన ఆలయ ప్రాంగణం



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మండల కేంద్రం లోని అంబాల క్రాస్ వద్ద గల ఎర్రగట్టు గుట్ట జాతర శ్రీవారి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు గురువారం శ్రీవారికి క్షీరాభిషేకం అర్చనలు ఈవో కిషన్ రావు ఉత్సవ కమిటీ సభ్యులు చే ఆలయ పూజారులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు వేదాంతం పార్థసారథులు పూజలు నిర్వహించారు. నాలుగో రోజు గురువారం వెంకన్న జాతరకు భక్తుల సంఖ్య పెరగడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం సాయంత్రంతో ఐదు రోజుల జాతర బ్రహ్మోత్సవాలు ముగింపు పూజలు నిర్వహించి ఎడ్లబండ్ల మీద భీమారం హసన్ పర్తికి ఉత్సవ విగ్రహాలను చక్రాల బండ్ల మీద డప్పు చప్పుళ్లతో కోలాటాల మధ్య వేం చేయుదురు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, వేల్పుల సదానందం, పెద్దమ్మ సురేష్, మూల నరోత్తం రెడ్డి, అల్లం సాయి కిరణ్ పటేల్, పెనుగుల అశోక్ కుమార్, సంగాల ప్రశాంత్ కుమార్, చల్ల సుమంత్ యాదవ్, కటికం శ్రీనాథ్ గౌడ్, కనపర్తి రాజు, జన్ను శైలజ, వింజమూరి రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ




**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లాలో ఏప్రిల్ 1వ తేదీ లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ మహేందర్ జీ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల ఆధ్వర్యంలో యాసంగి ధాన్యం కొనుగోలుపై శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు, హమాలీ కార్మికులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని ముఖ్యంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున సమృద్ధిగా తాగునీరు అందించాలని తెలిపారు. రైతులు కష్టపడి శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరపై రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేయాలన్నారు. గ్రేడ్ ఏ రకం వరి ధాన్యానికి ప్రభుత్వం రూ.2,203, సాధారణ రకం వరి ధాన్యానికి రూ.2,183 మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ములుగు జిల్లా సమీప చత్తీస్ గఢ్ రాష్ట్రంతో సరిహద్దు ఉన్న నేపథ్యంలో అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ అధికారుల సమన్వయంతో సివిల్ సప్లై అధికారులు , అగ్రికల్చర్ అధికారులు ఇతర రాష్ట్రాలలో పండించిన ధాన్యాన్ని ములుగు జిల్లాలోకి ప్రవేశించకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. అనంతరం సివిల్ సప్లై జిల్లా మేనేజర్ బి రాంపతి మాట్లాడుతూ యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు చేసే సందర్భంలో ఎలక్ట్రిక్ కాంటాలు మాత్రమే ఉపయోగించాలని, త్రికోణం కాంటాలను ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున నియమ నిబంధనకు లోబడి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, డీసీఓ సర్దార్ సింగ్, గిరిజన సహకార సంస్థ డిస్టిక్ మేనేజర్ ప్రతాపరెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ సుచరిత, ఇతర సివిల్ సప్లై అధికారులు, అగ్రికల్చర్ అధికారులు, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు , రైస్ మిల్లర్లు, పీటీసీ ఇంచార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్‌పై తప్పుడు కథనాలు సరికాదు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** కాంగ్రెస్ అంటేనే పేదల పక్షపాతి అని, సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కాంగ్రెస్ పాటుపడుతోందని, నేడు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పాలనలో బూత్ స్థాయి కార్యకర్తకు కూడా పనులు ఇవ్వటం జరిగిందని కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరా రెడ్డి అన్నారు. ప్రజల కోసం అహర్నిశలు పని చేస్తున్న ఎమ్మెల్యేపై తప్పుడు కథనాలు రాయటం సరికాదని, అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారన్న అక్కసుతో ఇలా రాయిస్తున్నారని ఎమ్మెల్యేపై వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. గురువారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై తప్పుడు కథనాన్ని ఖండించారు. కాంగ్రెస్ గెలిచిన నాటి నుంచే ప్రజా పాలనపై దృష్టి సారించిందని, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు వేయిస్తూ అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. అక్రమార్కులకు అడ్డుకట్ట వేసి వారిని నిలువరిస్తున్న క్రమంలో ఆయనపై కొందరు కావాలని తప్పుడు వార్తలు రాయిస్తున్నారని మండి పడ్డారు. ప్రజా పాలనలో భాగంగా రాత్రింబవళ్లు ఆయన ప్రతి మండలం సందర్శిస్తూ అధికారులతో రివ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే ప్రజా ప్రతినిధిపై అవాస్తవాలు, సత్యదూరమైన ఆరోపణలు చేయటం హేయనీయమని, ఆయన పరువుకు భంగం, కాంగ్రెస్ పాలనపై అసత్య ఆరోపణలు చేస్తూ కథనం రాసిన వారిపై చట్ట రీత్యా, న్యాయ శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై గత మూడు రోజుల నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, శాసన సభ్యుడు కల్వకుంట్ల తారక రామారావు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నందుకు నిరసనగా పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ఎస్.హెచ్.ఓ హనుమకొండ కేటీఆర్ ను అరెస్ట్ చేసి అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు ఇలాగే కొనసాగితే వారి పార్టీ గుర్తింపు రద్దుకు ఎలక్షన్ కమీషన్ ను కలిసి పార్టీ గుర్తింపు రద్దును చేయాలని కోరుతామని పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, సయ్యద్ విజయశ్రీ రాజాలి, సీనియర్ నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి, సయ్యద్ రాజాలి, బంక సంపత్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు తోట వెంకట రాజ్ కుమార్, లీగల్ సెల్ నాయకులూ తొగరు జగన్ మోహన్ రెడ్డి, రావుల శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు అలువాల కార్తీక్, జిల్లా ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు పల్లకొండ సతీష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు ఎస్.కుమార్ యాదవ్, గాండ్ల స్రవంతి, మంద రాకేశ్, బంక రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు అడ్‌హాక్ కమిటీ నియామకం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** జర్నలిస్టులందరిని సమన్వయ పరిచేందుకు, మరిపెడ ప్రెస్ క్లబ్ ఏర్పాటు ఆవశ్యకమని సీనియర్ జర్నలిస్టులు శ్రీరంగం శ్రీనివాస్, గాడిపల్లి శ్రీశైలం, గంధసిరి ఉప్పలయ్యలు అన్నారు. గురువారం మరిపెడ పట్టణ కేంద్రంలో సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో అడ్ హక్ కమిటీ నియామకం జరిగింది. ఈ కమిటీ సభ్యులుగా ఎండీ. రియాజ్ పాషా, వీరాంజీ, జిన్న లచ్చయ్య, వేణు, మచ్చ రాజేష్ లను నియమించటం జరిగింది. మరిపెడ మండలంలోని జర్నలిస్టులను సంఘటితం చేసి నూతన కమిటీని ఏర్పాటు చేయటమే కమిటీ లక్ష్యం. అందులో భాగంగా ఏప్రిల్ 3న మరిపెడలోని ఎస్సీ కమ్యూనిటీ భవనంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు, కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు సీనియర్ జర్నలిస్టులు సమావేశంలో వెల్లడించారు. కమిటీలో చేరిక కావాలి అనుకునే జర్నలిస్టులు అడ్ హక్ కమిటీలోని మెంబర్లకు తమ అభిప్రాయాన్ని తెలియజేసి సభ్యత్వం స్వీకరించాలని, ఏప్రిల్ 3న అంతా సమావేశానికి హాజరుకావాలని సూచించటం జరిగింది. అదే రోజున మరిపెడ మండలానికి సంబంధించి ప్రెస్ క్లబ్ ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కు సంబంధించి కమిటీ నియామకం జరుగుతుందని, అనంతరం మరిపెడ మండల ప్రెస్ క్లబ్ ఏర్పాటు అథెంటిక్ గా జరుగుతుందని సీనియర్ జర్నలిస్టులు ఈనాడు శ్రీనివాస్, సాక్షి ఉప్పలయ్య, ఆంధ్రజ్యోతి గాడిపల్లి శ్రీశైలం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా వీరాంజీ(ఎన్ టీవీ), మహేందర్(స్వతంత్ర), సంజీవ(రాజ్ న్యూస్), ఉపేందర్ సిలివేరు(శ్రీ న్యూస్), టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంధసిరి రవి(ముద్ర), జిల్లా సహాయ కార్యదర్శి జిన్న లచ్చయ్య(నవ తెలంగాణ), జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ అక్తర్(ప్రజా జ్యోతి), టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మండల అధ్యక్షుడు షేక్ సత్తార్ పాషా, సీనియర్ జర్నలిస్టులు నాగేందర్(వార్త) వేణు(సాక్షి రూరల్), రాజేష్(వెలుగు), గోవర్ధన్(మన తెలంగాణ), రేఖ వెంకటేశ్వర్లు(జనం సాక్షి), రియాజ్ పాషా(స్పాట్ వాయిస్), తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేటలో వ్యక్తిపై హత్యాయత్నం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** హనుమకొండ జిల్లా, కాజీపేట పట్టణ శివారులోని జూబ్లీ మార్కెట్ పరిధిలో ఓ వ్యక్తిపై కత్తితో హత్యాయత్నం జరిగిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూబ్లీ మార్కెట్ కు చెందిన పల్లపు మహేశ్వరి తన భర్త అయిన పల్లపు లక్ష్మణ్ 35 సంవత్సరాలు, తన ఆటోను తన ఇంటి ఎదుట పెట్టుకోవడానికి, నల్లా కనెక్షన్స్ కోసం తీసిన బండలు ఇబ్బందిగా ఉండడంతో వాటిని తీసి, చీకటి సమ్మయ్య ఇంటి ప్రహరీ గోడ పక్కన పెట్టారు. దీంతో సమ్మయ్య వచ్చి మాట్లాడుతుండగా సమ్మయ్య కొడుకు సుశీల్ కుమార్ ఆవేశంతో కత్తి తీసుకొని లక్ష్మణ్ మెడపై, చెంపపై దాడి చేశాడు. దీంతో ఆయన తలకు, శరీరానికి బలమైన గాయాలై, ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. దీనిపై లక్ష్మణ్ భార్య మహేశ్వరి చేసిన ఫిర్యాదు మేరకు కాజీపేట ఇన్ స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి ఉత్తర్వుల మేరకు ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేశామని తెలిపారు.

## మంద కృష్ణ మాదిగను కలిసిన అరూరి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మాజీ శాసన సభ్యుడు అరూరి రమేష్ గురువారం కలిశారు.

## పెరుమాండ్ల రామకృష్ణకు ఎంపీ టికెట్ ఇవ్వాలి

### ఉమ్మడి వరంగల్ జిల్లా క్రైస్తవుల అసోసియేషన్




**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** పెరుమాండ్ల రామకృష్ణకు ఎంపీ టికెట్ ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా క్రైస్తవుల అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం హనుమకొండ బాలసముద్రం ప్రెస్ క్లబ్ లో ట్రైసిటి క్రిస్టియన్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రైస్తవ అసోసియేషన్స్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ట్రై సిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ పాస్టర్ ఐజాక్, ఉపాధ్యక్షుడు రెవరెండ్ పాస్టర్ జోసఫ్ ప్రభాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ట్రైసిటి క్రిస్టియన్ ఫెలోషిప్,ఆల్ క్రిస్టియన్ అసోసియేషన్స్ వారు మాట్లాడుతూ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కు వరంగల్ నుంచి ఎంపీ టికెట్ కేటాయించాలని ఏఐసీసీ పెద్దలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలను కోరారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మూడున్నర లక్షల ఓట్లు దళిత క్రైస్తవులవి ఉన్నాయని రామకృష్ణకు టికెట్ ఇస్తే అందరం సహకారం చేస్తామన్నారు. పెరుమాండ్ల రామకృష్ణ పేదల డాక్టర్ గా విద్యావంతుడిగా వరంగల్ వాసిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతి గ్రామం ప్రతి పట్టణంలో జరుగుతున్న గత ప్రభుత్వంలో అక్రమాల మీద గత ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజలకు చేరువలో ఉండి ప్రజల కష్టసుఖాలను తెలిసిన వ్యక్తిగా రామకృష్ణ బడుగు బలహీన వర్గాల అందుబాటులో ఉంటూ ప్రజల గురించి పరితపించే వ్యక్తిగా హైదరాబాదులోని గల గవర్నమెంట్ హాస్పిటల్ లో ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ వరంగల్ లో కీలక పాత్ర పోషించారన్నారు. శాసనసభ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలో క్రైస్తవులందరినీ ఏకతాటి మీది తీసుకువచ్చి వరంగల్ ఎమ్మెల్యేల గెలుపులో తనవంతు బాధ్యతగా కష్టపడ్డాడని తెలిపారు. ఇలాంటి నాయకుడికి టికెట్ ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా క్రైస్తవులు కోరారు. ఈ కార్యక్రమంలో ట్రై సిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ డా. దామెర ఐజాక్, ఉపాధ్యక్షుడు రెవరెండ్ డా.ఎం జోసఫ్ ప్రభాకర్, ఇంచార్జి సెక్రటరీ సువర్ణ రాజ్, జాయింట్ సెక్రెటరీ ఎం.వి లాజరెస్ (సీబీసీ), జాయింట్ సెక్రెటరీ తాళ్లపెల్లి ప్రసంగి , ఈసీ మెంబర్ రెవరెండ్ యూ.డేవిడ్, ఈసీ మెంబర్ పాస్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చిరునవ్వే పలకరింపుగా.. మంచి తనమే ఆభరణంగా..
వృత్తి జీవితంలో అందరికీ తలలో నాలుకలా మెదిలిన మహోన్నత వ్యక్తి **మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్.** పెదవులపై చెరగని చిరునవ్వుతో ఆయన పనిచేసిన ప్రతిచోట తన ముద్రను వేశారు. గ్రూప్ -2 ఆఫీసర్ నుంచి గ్రూప్-1 అధికారిగా.. అనేక పదోన్నతులు పొందారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీగా కొనసాగుతూ మార్చి 31న పదవీ విరమణ చేయనున్న మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ వృత్తి జీవితం ఎందరికో ఆదర్శనీయం. సమాచార, పౌర సంబంధాల శాఖలో వివిధ హోదాల్లో మూడు దశాబ్దాలకు పైగా పనిచేసి సంయుక్త సంచాలకుడిగా పదవీ విరమణ చేస్తున్న మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ అందరివాడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఎవరు కలిసినా చిరునవ్వుతో పలకరించడం ఆయనకు మాత్రమే అలవడిన గొప్ప లక్షణం. చిరు దరహాసంతోనే ప్రజాసంబంధాలు ప్రారంభమవుతాయని ఆయన ప్రగాఢంగా నమ్మేవారు. అందుకే ఆయన ఎవరు కనబడినా చిరునవ్వుతోనే పలకరించేవారు.



- గడ్డం కేశవమూర్తి




జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం



# అజాత శత్రువు బాలగంగాధర్ తిలక్



అంచెలంచెలుగా ఎదిగిన వైనం

వివాదరహితుడిగా గుర్తింపు..

ఉత్తమ పౌర సంబంధాల అధికారిగా అవార్డు

ఆదర్శప్రాయుడిగా నిలిచిన తిలక్

మార్చి 31న పదవీ విరమణ

సమాచార శాఖలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఆదిలాబాద్ నుంచి ఇటు విశాఖపట్నం వరకు అనేక జిల్లాల్లో వివిధ హోదాల్లో తిలక్ పనిచేశారు. పనిచేసిన ప్రతీ జిల్లాలో విస్తృత స్థాయిలో పరిచయాలను పెంచుకున్నారు. పరిచయాలను పెంచుకోపోవడమే కాకుండా, ఇన్నేళ్లయినా వారితో సత్సంబంధాలను కొనసాగించడం తిలక్‌లోని ప్రత్యేకత. అందుకే, ఏ జిల్లాలోనైనా, ఏ ప్రభుత్వ శాఖల్లోనూ తిలక్ కు విస్తృతమైన పరిచయాలు ఉన్నాయి.

## వృత్తి పట్ల అంకిత భావం...

1994లో గ్రూప్ 1 అధికారిగా డీపీఆర్ఓగా సమాచార శాఖలో జాయిన్ అయిన, మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ అంతకు ముందు గ్రూప్ -2 ద్వారా చేనేత జౌళి శాఖలో డెవలప్ మెంట్ అధికారిగా కొంతకాలం సేవలందించారు. స్వతహాగా, కళలన్న, కళా కారులన్నా ప్రత్యేక ప్రేమ చూపించే ఆయన, వరంగల్, కరీంనగర్ జిల్లాలో పనిచేసినప్పుడు, ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా ఆ సభా వేదికపై ప్రత్యేక అతిథిగా తిలక్ దర్శనమిచ్చేవారు. ఉద్యోగ మిత్రుడిగా ఉండే తిలక్ తన స్వవిషయాలను, ప్రధానంగా ఆర్థికాంశాలను పెద్దగా పట్టించుకునే వాడు కాదు. కనీసం తనకు రావాల్సిన, జీత భత్యాలు, ఇంక్రిమెంట్లు, ఇతర ఎరియర్స్‌లను కూడా పట్టించుకునే వారుకాదు. నాణానికి బొమ్మా, బొరుసు ఉన్న మాదిరిగానే, తిలక్ జీవితంలోనూ విషాదాధ్యాయం ఉంది. కుటుంబ పరంగా ఎంతో కోల్పోయిన








వారికి, వారి శ్రీమతి ఇచ్చిన సహకారంతో తన ఏకైక కుమారుడిని వైద్య రంగంలో, ఉన్నత స్థానానికి చేరుకునేలా ప్రోత్సాహం అందించారు.

## వివాదరహితుడిగా గుర్తింపు..

ఒక్క సమాచార శాఖలోనే కాదు, పొరుగు శాఖల్లోనూ పలు హోదాల్లో డిప్యుటేషన్ పై పనిచేశాడు. ఎక్కడ పనిచేసినా అందరి తలలో నాలుకై కలిసిపోయే తత్వం ఉన్న తిలక్ వివాదరహితుడిగా ఉండడమే కాదు, అందరి ప్రేమను పొందాడు. తనకున్న మిత్రులందరినీ గుడ్ మార్నింగ్ అనే మెసేజ్‌లతో పలకరిస్తారు. ప్రతీ రోజూ ఈ మెసేజ్‌లు చిరాకు కల్పించవచ్చుగానీ, ఆ మెసేజ్‌లతో తమ అనుబంధాలను మరింత పటిష్టపడేందుకు దోహదపడిందని చెప్పవచ్చు. స్వతహాగా తెలంగాణ బిడ్డ అయినప్పటికీ, రాష్ట్రాల పునర్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపబడ్డాడు. అయినప్పటికీ, 'ఆడా ఉంటా ...ఈడా ఉంటా' అనే సినీ డైలాగ్‌ను నిజం చేస్తూ ఇరురాష్ట్రాల అధికారులు, మిత్రులతో ఎప్పటిలాగానే స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూనే ఉంటున్నాడు. నిగర్వి, వివాద రహితుడు, మంచి మిత్రుడు, పౌర సంబంధాలకు అసలైన నిర్వచనంగా భావించే బాలగంగాధర్ తిలక్ మార్చి 31 , 2024న పదవీ విరమణ చేయనున్నారు.

## ప్రస్థానం...

మంచితనానికి మారుపేరుగా నిలిచిన మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ ఖమ్మం జిల్లా కూనవరం గ్రామంలో 28 మార్చి 1962లో సుబ్బారావు- సత్యవతి దంపతులకు జన్మించారు. ప్రాథమిక, ఉన్నత విద్య కూనవరంలో కొనసాగింది. ఇంటర్, డిగ్రీ భద్రాచలంలో పూర్తిచేశారు. బీసీజే, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంసీజే, ఎంఫిల్ హైదరాబాద్ ఉస్మానియా విద్యాలయంలో చదివారు. 1989లో అప్పటి ఏపీపీఎస్సీ గ్రూప్ -2 రాసి ఉత్తీర్ణత సాధించి చేనేత జౌళి శాఖలో డెవలప్ మెంట్ అధికారిగా నియమితులయ్యారు. 1990లో హైదరాబాద్ కమిషనర్ ( చేనేత జౌళి శాఖ) కార్యాలయంలో అసిస్టెంట్ డెవల్ మెంట్ ఆఫీసర్ గా చేరారు. 1991లో బదిలీపై ఖమ్మంకు వెళ్లారు. 1994 జూన్ లో ప్రమోషన్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా వరంగల్‌కు బదిలీపై వచ్చారు. 1994 లో ఏపీపీఎస్సీ ద్వారా డీపీఆర్ఓగా ఎంపికై 1994 నవంబర్ లో ఏపీఓ(పబ్లిసిటీ)గా భద్రాచలం ఐటీడీఏలో చేరారు. 1997 వరకు భద్రాచలంలో పనిచేశారు. 1997లో కరీంనగర్ డీపీఆర్ఓగా బదిలీ కావడం, 2000 సంవత్సరంలో భద్రాచలం ఏపీఓగా బదిలీ జరిగింది. భద్రాచలం నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ గా పదోన్నతి హైదరాబాద్ కు వెళ్లారు. హైదరాబాద్ నుంచి ఏపీ భవన్ న్యూఢిల్లీకి బదిలీపై వెళ్లి పనిచేశారు. హైదరాబాద్ పబ్లిసిటీ సెల్ ఏడీగా, అక్కడ నుంచి డిప్యూటేషన్ పై కమర్షియల్ టాక్సెస్ కమిషనర్ కార్యాలయంలో సీపీఆర్ఓగా పనిచేశారు. పదోన్నతి ఏడీ టూ డిప్యూటీ డైరెక్టర్ ఏపీ విజిలెన్స్ కమిషన్ కు సీనియర్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ గా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి 2007లో జీహెచ్ఎంసీ సీపీఆర్ఓగా పనిచేశారు. అక్కడి నుంచి ఐటీడీఏ ఐకేపీలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా భద్రాచలంకు బదిలీ అయి 2008 నుంచి 2011 వరకు పనిచేశారు. భద్రాచలం నుంచి సెర్ప్ ప్రధాన కార్యాలయానికి స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్, (కమ్యూనికేషన్స్)గా బదిలీ అయ్యారు. 2014 మార్చిలో డిప్యూటీ డైరెక్టర్ ఐఅండ్‌పీఆర్‌గా, వరంగల్‌కు బదిలీ అయి పనిచేశారు. 2015 నవంబర్‌లో వరంగల్ నుంచి ఏపీ స్టేట్‌కు బదిలీ అయ్యారు. 2015 డిసెంబర్ 2017 మార్చి వరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ గా పని చేశారు. 2017 మార్చిలో ఆర్ జేడీగా పదోన్నతి పొంది 2019 నవంబర్ వరకు విశాఖపట్నంలో కొనసాగారు. నవంబర్ 2019 నుంచి నేటి వరకు ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీగా విజయవాడలో ఉన్నారు. ఈ నెల 31న బాలగంగాధర్ తిలక్ పదవీ విరమణ చేయనున్నారు.

## సత్కారాలు, సన్మానాలు..

మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ పదిసార్లు జిల్లా కలెక్టర్ల నుంచి మెరిట్ సర్టిఫికెట్స్ అందుకోవడమే కాక, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నుంచి సత్కారాలు సన్మానాలు వందల సార్లు పొందడం జరిగింది. రాష్ట్ర మంత్రుల నుంచే కాక కేంద్ర హోం మంత్రి నుంచి కూడా సత్కారాలు అందుకున్నారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ ఉత్తమ పౌర సంబంధాల అధికారి అవార్డు పొందారు. మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, తన భార్యభర్తలు భౌతిక కాయాలను వైద్య పరిశోధనలకు గానూ కేఎంసీకీ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అంతేకాకుండా కరీంనగరలో కలెక్టర్ దేవబ్రతకంత ఆధ్వర్యంలో ఆయన డీపీఆర్ఓగా ఉండి లక్షా 43 వేల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి రికార్డు సృష్టించారు.

## ప్రొఫైల్ ...

పేరు : మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్.
తండ్రి పేరు : సుబ్బారావు,
తల్లి పేరు : సత్యవతి
జన్మస్థలం : కూనవరం, ఖమ్మం జిల్లా
పుట్టినతేది : 28-03-1962
విద్యార్హత : ఏంఏ, ఎంసీఏ, ఎంఫిల్ (ఉస్మానియా యూనివర్సిటీ)
ఉద్యోగ ప్రస్థానం : 1989 గ్రూప్-2లో అసిస్టెంట్ డెవలప్ మెంట్ ఆఫీసర్ (చేనేత జౌళి శాఖ) 1994లో డీపీఆర్ఓగా ఐటీడీఏ భద్రాచలం
ప్రస్తుతం : ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీ (పదవీ విరమణ 31-03-24)
అవార్డు : పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ పౌర సంబంధాల అధికారిగా అవార్డు పొందారు.



# వారిది త్యాగాల కుటుంబం

**రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం**

**పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం**

**రాష్ట్ర మంత్రి సీతక్క**



**వరంగల్ వాయిస్, ములుగు :** రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమని, ఆయనను ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అటవీ హక్కుల చట్టం, ఆహారభద్రత,,ఉపాధి హామీ, సమాచార హక్కు,,విద్య హక్కు చట్టాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. అంతేకాకుండా పేదలకు ఏడు విడుతలుగా భూపంపిణీ చేశామని వెల్లడించారు. మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక నల్లా చట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసి వాళ్ళ అప్పులు మాఫీ చేసిందని ధ్వజమెత్తారు. ప్రతి ఒక్క కుటుంబానికి వారి బ్యాంక్ అకౌంట్ లో రూ.15 లక్షలు వేస్తానని మోసం చేసిన నీచమైన చరిత్ర బీజేపీదన్నారు. ఉద్యోగాలు కల్పించకుండా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిన బీజేపీకి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్ట పడాలని సూచించారు. వంద ఏనుగులను తిన్న రాబందు ఒక్క గాలి వానతోకుప్పకులినట్లు, పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ కి ప్రజలు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చారన్నారు. దీంతో బీఆర్ ఎస్ నాయకులు మా ప్రభుత్వంపై ఇష్టానురీతిగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మన ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కష్ట పడి పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడే బాధ్యత తను తీసుకుంటానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, ములుగు మండల క్లస్టర్ ఇంఛార్జిలు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్డ్ తుపాకులను అప్పగించండి

**వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రభుత్వ అనుమతులతో తుపాకులను కలిగి ఉన్న వారు వాటిని స్థానిక పోలీస్ స్టేషన్ లో అప్పగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశించారు. పార్లమెంట్ ఎన్నికల వేళ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 201 అనుమతి ఉన్న తుపాకులుండగా ఇందులో హనుమకొండ జిల్లాలో 131, వరంగల్ జిల్లాలో 52, జనగామ జిల్లాలో 18 ఉన్నాయన్నారు. పోలీస్ స్టేషన్ లో అందజేసిన ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి అప్పగిస్తామన్నారు. అలాగే జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సాంకేతికతో వేగం, భద్రత

**సెమినార్ డైరెక్టర్ డాక్టర్ మాదాసి కనకయ్య**

**ముగిసిన జాతీయ సదస్సు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆధునిక సాంకేతికను అభివృద్ధి చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థలకు ఎంతో లాభం చేకూరుతుందని, పనిలో వేగం పెరిగి భద్రత, భరోసా లభిస్తుందని సెమినార్ డైరెక్టర్ డాక్టర్ మాదాసి కనకయ్య తెలిపారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో 'ఫిన్టెక్ రెవల్యూషన్' అంశంపై రెండు రోజులు జరిగిన జాతీయ సదస్సు ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కనకయ్య మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతికతను అంది పుచ్చుకోవాలన్నారు. ఈ సదస్సుకు అతిథిగా హాజరైన రిటైర్డ్ కామర్స్ ప్రొఫెసర్ సక్రియ మాట్లాడుతూ యాజమాన్యానికి, వినియోగదారుడికి ఒక మంచి సంబంధం ఏర్పడి వారి ద్రవ్యాన్ని చాలా సరళమైన పద్ధతుల్లో పంపించడం, తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతో ప్రజలకు ఉపయోగాలు ఎన్ని ఉన్నాయో దాని వెనకే ఇబ్బందులు కూడా ఉంటాయన్నారు. వినియోగదారుడు ఏమరపాటున లేకుంటే జేబులు గుల్ల అవుతాయన్నారు. పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడుతూ అనేక సాఫ్ట్ వేర్ కంపెనీలు వచ్చాయని యువత కూడా ఉపాధి అవకాశాలు బాగా పెరిగిపోయాయన్నారు. సెమినార్ అధ్యక్షులు, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ ఇలాంటి జాతీయ సదస్సులతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడతాయని, అందుకే ఇలాంటి వాటిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరత్నం, రిటైర్డ్ ప్రొఫెసర్లు సాయిలు, రాజిరెడ్డి, చారి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, కామర్స్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బైరు నిరంజన్, డాక్టర్ ఈ రాజు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సునీత, డాక్టర్ సాయి చరణ్, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ సరిత, డాక్టర్ నరేందర్, డాక్టర్ రజిని, డాక్టర్ పాణి, డాక్టర్ ప్రగతి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సురేష్, డాక్టర్ గిరిప్రసాద్, వీరన్న, హరిత, రవిబాబు, సోమశేఖర్, జోత్స్న, రాజేందర్, విద్యార్థి విద్యార్థినిలు పాల్గొన్నారు.

# దుగ్గొండి మండలంలో కావేరీ కంపెనీ ప్రతినిధుల క్షేత్ర పదర్శన

**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** దుగ్గొండి మండలం కొత్తపెల్లి గ్రామం కావేరి కంపెనీ ప్రతినిధులు కేయంహెచ్ – 8208 మొక్కజొన్న పంటను క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ మక్కజొన్న ప్రదర్శనకి కొత్తపెల్లి, నల్లబెల్లి, మొంద్రాయి, తూర్పు తండ, బాలనాయక్ తండా, నార్లవాయికి చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు గల సందేహాలను కావేరీ కంపెనీ వరంగల్ ప్రతినిధి (టీఎస్యం) నితిన్ పరిష్కారం చూపడం జరిగింది. ఎకరాకు 40 క్వింటాళ్ల పైనా దిగుబడి వస్తుందని, గింజలు పైనా కొన వరకు వచ్చి బెండు సన్నగా వస్తుందని, లాబాలు అధికంగా ఉంటాయని వివరించడం జరగినది. ఈ సందర్భంగా రైతు మధు మాట్లాడుతూ.. రైతుల పాలిట కావేరీ కంపెనీ ఉత్పత్తులు వరంలా మారాయాని, ఇంత మంచి విత్తనం ఇచ్చిన కావేరీ కంపెనీకి రైతుల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు. కార్యక్రమంలో రాజు, లెనిన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# మండలానికో ధాన్యం కొనుగోలు కేంద్రం

**ఏప్రిల్ 1న ప్రారంభం**

**సన్నాహక సమావేశంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏప్రిల్ 1న జిల్లాలోని ప్రతి మండలంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రకటించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు నిర్వహించాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో గురువారం యాసంగి 2023-24 సంవత్సరంలో ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులు, ధాన్యం కొనుగోళ్లను చేపట్టే మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులు, ధాన్యం తరలించేందుకు సంబంధించిన లారీ ఓనర్ల సంఘం, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్, మే నెలల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సదుపాయం కల్పించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 146 దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. శుభ్రం చేసిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ఏ రోజుకారోజు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. మిల్లర్లు రోజువారి లక్ష్యాన్ని పూర్తి చేస్తేనే నిర్దేశించిన గడువు వరకు సీఎంఆర్ ను పూర్తి చేయవచ్చన్నారు. సీఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారని పేర్కొన్నారు. సీఎంఆర్ లక్ష్యాన్ని పెండింగ్ లో లేకుండా చూసుకోవాలని మిల్లర్లకు కలెక్టర్ సూచించారు. జిల్లాలోని వివిధ రైస్ మిల్లుల యజమానులను నిర్దేశిత సీఎంఆర్ కెపాసిటీ, దానిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని వివరాలను జిల్లా కలెక్టర్ రైస్ మిల్లుల యజమానులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయని అన్నారు. కల్లాల వద్దనే ధాన్యం ఆరబోసుకునే విధంగా రైతులకు తెలియజేయాలన్నారు. ధాన్యంలో తేమ శాతం లేకుండా చూసుకోవాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, డీఆర్డీవో నాగ పద్మజ, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, ఏడీఏ దామోదర్ రెడ్డి, ఏసీఎస్ఓ నరసింహారావు, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వసంతలక్ష్మి, డీఎం మహేందర్, ఏసీఎస్ఓ కేవైఎల్ నరసింహారావు, సివిల్ సప్లై డీటీలు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com